సాక్షి విశాఖపట్నం

శనివారం ׀ 28 ׀ సెప్టెంబర్ ׀ 2024



బాక్సింగ్ ఓవరాల్ చాంప్ ఉత్తర రైల్వే

అఖిల భారత అంతర రైల్వేస్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను ఉత్తర రైల్వే బాక్సర్లు కైవసం చేసుకున్నారు. 8లో



కురుస్తూనే ఉంది.! 8లో

రుతుపవనాలు ప్రభావం.. ఉత్తరాంధ్రకు సమీపానికి వచ్చి బలహీనపడుతూ వెళ్లిపోయిన ఉపరితల ఆవర్తన ప్రభావం.. నగరంపై కనిపించింది.



ప్రహ్లాద్‌కు వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం 8లో

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈవోగా శోభారాణి



కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉప కమిషనర్ శోభారాణి

అల్లిపురం: బురుజుపేటలో వెలిసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా, ఉప కమిషనర్ కె.శోభారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆమె అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, సహాయ కార్యనిర్వహణాధికారి టి.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు కె.పద్మజ, ఎం.వి.రమణ, ఎ.తిరుపతిరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ డీసీగా శ్రీరామచంద్రమూర్తి



మద్దిపాలెం: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు బిర్లా జంక్షన్ సమీపం మాధవధార ప్రాంతంలోని ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ప్రైవేటు మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనలు మేరకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

2న ఉక్కు సత్యాగ్రహ దీక్ష

ఉక్కునగరం: కూర్మన్నపాలెం నిరాహార దీక్ష శిబిరం వద్ద అక్టోబర్ 2న ఉక్కు సత్యాగ్రహ దీక్ష చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయించింది. శుక్రవారం జరిగిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నారు. అలాగే 6న ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల పాటు అగనంపూడి నుంచి పాతగాజువాక వరకు మానవహారం చేపట్టనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలను కలవనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ కావాలని లేఖలు రాయాలని ఈ మేరకు తీర్మానించారు. పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, శ్రీనివాసరాజు, వరసాల శ్రీనివాస్, కె. శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డ్ ఏఎస్‌గా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న రియర్ అడ్మిరల్ శ్రీనివాస్

సింధియా: నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఫ్లాగ్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో సముద్రంలో వివిధ ర్యాంక్‌లో ఉన్న విమాన నౌక ఐఎన్‌ఎస్ విరాట్‌తో సహా పలు నౌకలకు విస్తృత సేవలనందించారు. అదే విధంగా ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య మరమ్మతులను పర్యవేక్షించారు. న్యూఢిల్లీలోని నేవల్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ప్రాజెక్ట్స్, ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఫ్లీట్ మెయింటెనెన్స్‌లో కీలకంగా వ్యవహరించారు.

పంచకర్ల సిఫార్సులకు బాబ్జీ గండి!



- పెందుర్తి తహసీల్దార్ పోస్టింగ్ కోసం బాబ్జీ పట్టు
- పద్మనాభం నుంచి ఆనంద్‌కుమార్‌ను వేయాలని సిఫార్సు
- బాబ్జీ చెప్పినట్టే వినాలంటూ ఉన్నతాధికారులకు భరత్ స్పష్టీకరణ
- బదిలీల గడువు ముగిసిన తర్వాత పాత తేదీలతో ఆదేశాలు
- డీటీ, సర్వేయర్, ఎంపీడీవో పోస్టింగ్‌ల్లోనూ అదే తీరు
- ఎక్కడా చెల్లుబాటు కాని పంచకర్ల సిఫార్సులు

మొన్నటికి మొన్న పోలీసుశాఖ బదిలీల్లో మాట చెల్లుబాటు కాలేదని మథనపడిన పంచకర్ల రమేష్‌బాబుకు రెవెన్యూ బదిలీలల్లోనూ అదే నగుబాటు ఎదురైంది. పెందుర్తి తహసీల్దారు పోస్టింగ్‌లో పంచకర్ల చెప్పిన పేరును కాకుండా తాజాగా గండి బాబ్జీ చెప్పిన వ్యక్తికి పోస్టింగ్ దక్కడం చర్చనీయాంశమైంది.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



కొద్దిరోజుల క్రితం సీఐల పోస్టింగ్‌ల విషయంలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతో అలిగి గన్‌మెన్లను సైతం వెనక్కి పంపి.. ఆ తర్వాత మిన్నకుండిపోయిన పంచకర్ల తాజా తహసీల్దార్ల బదిలీల్లో కనీసం స్పందించకుండా మౌనం వహించారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ తన మాట చెల్లుబాటు కాకపోవడంపై ఆయన లోలోన రగిలిపోతున్నారు. అయినప్పటికీ పొత్తు ధర్మంలో భాగంగా బహిరంగంగా వ్యాఖ్యానించకుండా తమ పార్టీ అధిష్టానం వద్ద విన్నవించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అయితే గతంలో కూడా సీఐల బదిలీల విషయంలో అధిష్టానానికి చెప్పినప్పటికీ స్పందన లేకపోవడంతో... ఈసారీ అదే పరిస్థితి ఉంటుందని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పంచకర్ల అయినప్పటికీ... గండి బాబ్జీ మాటే చెల్లుబాటు అయ్యేలా టీడీపీ నేతల నుంచి వచ్చిన ఆదేశాలతోనే జిల్లా ఉన్నతాధికారులు ఆయన సిఫార్సులకే పెద్ద పీట వేస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా ఎంపీ భరత్ జోక్యం చేసుకుని గండి బాబ్జీకి ప్రాముఖ్యత ఇవ్వాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు ఇచ్చిన ఆదేశాలతోనే ఈ వ్యవహారమంతా నడుస్తోందని టీడీపీలో చర్చ నడుస్తోంది.

పాత తేదీలతో ఆదేశాలు..!

వాస్తవానికి ఉద్యోగుల బదిలీల గడువు ప్రక్రియ సెప్టెంబరు 15వ తేదీ నాటికి పూర్తి కావాలి. విజయవాడ వరదల నేపథ్యంలో 23కు వరకు బదిలీల ప్రక్రియ చేపట్టారు. గండి బాబ్జీ ప్రతిపాదనలకు పెద్ద పీట వేయాలని ఎంపీ భరత్ ఆదేశాల మేరకు బదిలీల గడువు ముగిసిన తరువాత పాత తేదీలతో (సెప్టెంబరు 22వ తేదీ) పోస్టింగ్‌లు ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఈ ఆదేశాలు మాత్రం 26వ తేదీ రాత్రి బయటకు రావడం గమనార్హం. అంతేకాకుండా ఏఎస్‌వో సర్కిల్–1లో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా కొద్దిరోజుల క్రితం పోస్టింగ్ ఇచ్చిన బంటు రమణను మార్చాలంటూ బియ్యం మాఫియా పట్టుబట్టడంతో ఆయనకు విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన డి.జానకిని విశాఖ ఏఎస్‌వో కార్యాలయంలో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరికీ కూడా బదిలీల గడువు ముగిసిన తర్వాత పాత తేదీలతో పోస్టింగ్‌లు ఇవ్వడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బాబ్జీకి భరత్ సపోర్టు...!

వాస్తవానికి విశాఖ దక్షిణ సీటును ఆశించిన గండి బాబ్జీ.. ఆ సీటు దక్కకపోవడంతో పార్టీ మారుదామని భావించారు. అయితే ఎక్కడి నుంచి పిలుపు లేకపోవడంతో మిన్నకుండిపోయారు. అనంతరం ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఓ సమావేశంలో మాడుగుల సీటు లభించిన బండారుకు ఇక పెందుర్తిలో పనులేమీ చేయవద్దనే అర్థంలో వ్యాఖ్యానించారు. అయితే అక్కడితో ఆగకుండా పెందుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పంచకర్ల మాట కూడా చెల్లుబాటు కాకుండా చక్రం తిప్పడం ప్రారంభించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన సీఐల పోస్టింగ్‌ల విషయంలోనూ గండి బాబ్జీ సిఫార్సు చేసిన వారినే నియమించారు. దీనిని నిరసిస్తూ తన గన్‌మెన్లను వెనక్కి పంపుతున్నట్టు నేరుగా పోలీస్‌బాస్‌కు పంచకర్ల స్పష్టం చేశారు. అయినప్పటికీ సానుకూల స్పందన రాకపోవడంతో మిన్నకుండిపోయారు. ఇక తాజాగా పెందుర్తి తహసీల్దార్ పోస్టింగ్ విషయంలోనూ గండి బాబ్జీ మాటే చెల్లుబాటు కావడంతో పంచకర్ల షాక్ తిన్నారు. వాస్తవానికి పెందుర్తి తహసీల్దార్‌గా ప్రస్తుతం ఉన్న కె.వేణుగోపాల్ స్థానంలో మరొకరిని నియమించాలని పంచకర్ల భావించారు. అయితే, ఎవరిని నియమించాలనే విషయంలో మాత్రం పంచకర్ల నుంచి ఎటువంటి ప్రతిపాదనలను జిల్లా ఉన్నతాధికారులు కోరకపోవడం గమనార్హం. మరోవైపు పద్మనాభం తహసీల్దార్‌గా ఉన్న ఆనంద్‌కుమార్‌కు పెందుర్తిలో పోస్టింగ్ ఇవ్వాలని గండి బాబ్జీ నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయి. గండి బాబ్జీ చెప్పిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలంటూ ఎంపీ భరత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గండి బాబ్జీ ప్రతిపాదనలు, ఎంపీ భరత్ ఆదేశాల మేరకు పెందుర్తి తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా డీటీ, సర్వేయర్లు, ఎంపీడీవో పోస్టింగ్ విషయంలోనూ పంచకర్ల మాటకు విలువ లేకుండా పోయింది. ఎంపీడీవో రమేష్ నాయుడును కొనసాగించాలని పంచకర్ల కోరినప్పటికీ కనీసం పరిగణనలోనికి తీసుకోకపోవడం ఆయనకు చిర్రెత్తుకొచ్చినట్టు తెలుస్తోంది.

బాబు పాపాల ప్రక్షాళనకు నేడు పూజలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం :

చంద్రబాబు పాపాల ప్రక్షాళన చేసేందుకు శనివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రుషికొండలోని టీటీడీ ఆలయంలో నిర్వహించే పూజల్లో తాను పాల్గొంటానన్నారు.

- విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో కప్పరాడ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గం 11వ వార్డు అరిలోవ భరత్ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహిస్తారు.
- దక్షిణ నియోజకవర్గంలోని వేంకటేశ్వర స్వామి మెట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు, కొబ్బరి కాయలు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.
- గాజువాక నియోజకవర్గంలోని బీహెచ్‌పీవీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి చెప్పారు.
- భీమిలి నియోజకవర్గంలోని శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో, అనంత పద్మనాభ స్వామి ఆలయంలో, వేంకటేశ్వరమెట్టపై, రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

బదిలీల 'పంచాయితీ'

- పంచాయతీరాజ్ శాఖ బదిలీల్లో అక్రమాలు
- కీలక మండలాల్లో పోస్టుకు రూ.10 లక్షలు
- అనకాపల్లిలో కానుల కుమ్మరింపు.. ఎడాపెడా పోస్టింగ్‌లు
- ఏజెన్సీ విషయంలో నిబంధనలు పాటించని అధికారులు
- డీపీవోపై ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారికి ఫిర్యాదు

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీల పంచాయతీ అగ్గి రాజేస్తోంది. కార్యనిర్వాహక అధికారుల బదిలీ ప్రక్రియపై ఆరోపణలు భగ్గుమంటున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల పేరుతో ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు ఇచ్చేశారు. వారి నుంచి భారీగా ముడుపులు తీసుకొని కావాల్సిన పోస్టింగ్‌లు ఇచ్చారన్న టాక్ నడుస్తోంది. ఈ విషయంలో నిబంధనలకు సైతం తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి, 50 ఏళ్లు దాటిన వారికి అల్లూరి జిల్లా నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలి. కానీ అలా చేయకపోవడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ బదిలీల్లో కొంత మంది పంచాయతీ అధికారులు చేతివాటం ప్రదర్శించడంతో ఏజెన్సీలో పనిచేస్తున్న ఈవోపీఆర్‌డీవోలు అక్కడే ఉండిపోయారు. ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారన్న ప్రచారం సాగుతోంది. అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న ఈ బదిలీల ప్రక్రియపై ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి అయిన విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

ఖాళీలు లేవట

మైదాన ప్రాంతాల్లో ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ పోస్టులు ఖాళీలు లేవని, అందుకే ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయలేదని పంచాయతీ అధికారులు బహిరంగంగా చెబుతున్నారు. సర్వీసులో ఇంతవరకు ఏజెన్సీలో పనిచేయని ఈవోఆర్‌డీవోలు ఎంతోమంది ఉన్నారు. వారిని నిబంధనల ప్రకారం ఏజెన్సీలో నియమించాల్సి ఉంది. కానీ వారి జోలికి అధికారులు వెళ్లకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

బదిలీలు జరిగిన వారం రోజులకు ఫిర్యాదు

ఈనెల 22న ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ బదిలీ లు జరిగాయి. ఈ బదిలీలు జరిగిన వారం రోజులకు ఫిర్యాదు చేయడమేంటి? వారికి అభ్యంతరాలు ఉంటే బదిలీలు జరిగిన తర్వాత రోజే ఫిర్యాదు చేయాలి. అయినా అనకాపల్లి జిల్లాలో ఎటువంటి రిక్రూట్‌మెంట్ లేదు. అన్ని మండలాల్లో ఈవోలు ఉన్నారు. ఎక్కడా ఖాళీలు లేవు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. బదిలీలన్నీ పారదర్శకంగా జరిగాయి.

– శిరీషరాణి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), అనకాపల్లి జిల్లా

పర్యాటకంలో విశాఖకు అవార్డుల పంట 8లో

విదేశీ పర్యాటకానికి విశాఖ చిరునామా

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్. చిత్రంలో జేసీ మయూర్ అశోక్



కళాకారుల నృత్య ప్రదర్శన

మహారాణిపేట: విదేశీ పర్యాటకానికి విశాఖను చిరునామాగా మారుస్తామని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ సహకారంతో అతి త్వరలోనే సైన్స్ మ్యూజియం కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం స్థానిక వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఏరినాలో జిల్లా యంత్రాంగం, టూరిజం శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఉత్తమ ఫొటో గ్రాఫర్లకు కలెక్టర్ అవార్డులు అందజేశారు. సాక్షి ఫొటోగ్రాఫర్ ఎం.డీ.నవాజ్‌కు ప్రశంసా పత్రం,నగదు పురస్కారం అందజేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కూచిపూడి ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది. వేడుకల్లో జేసీ మయూర్ అశోక్, జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవేణి, కళారత్న బాలకొండల రావు తదితరులు పాల్గొన్నారు.

నగరమంతా ఏఐ సేవలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్ చలానాలు

- ప్రతి పోలీస్ స్టేషన్‌కు గంజాయి టెస్టింగ్ కిట్
- మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు
- పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి



మధురవాడ: త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్ చలానాలు విధించే పద్ధతిని అందుబాటులోకి తీసుకురానున్నామని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. శుక్రవారం పీఎంపాలెం పోలీసుస్టేషన్‌లో నిర్వహించి మీడియా సమావేశంలో మాట్లాడారు. నిబంధనలు పాటించకుండా ఎవరైనా ప్రయాణిస్తే ఏఐ పరిజ్ఞానం ద్వారా ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నేషన్ కెమెరా గుర్తిస్తాయని, తద్వారా ఈ చలానాలు విధిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ స్టార్ట్ చేశామని త్వరలో నగరమంతా ఇదే సిస్టం అమలు చేస్తామన్నారు. సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా రికార్డ్ అవుతుందన్నారు. ఇప్పటికే ప్రజల్లో హెల్మెట్ ధారణపై అవగాహన పెరిగిందన్నారు.

గంజాయి టెస్టింగ్ కిట్స్ : గంజాయి నియంత్రణకు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో రెండు మాత్రమే స్నిఫర్ డాగ్స్ ఉండేవని మరో 8 రప్పిస్తున్నామన్నారు. గంజాయిని పసిగట్టేందుకు వీటిని ఉపయోగిస్తామని, ముఖ్యమైన పోలీసు స్టేషన్‌కు స్నిఫర్ డాగ్ కేటాయిస్తామన్నారు. గతంలో 2 గంజాయి టెస్టింగ్ కిట్స్ మాత్రమే ఉండేవని, నార్కోడిక్స్ కంట్రోల్ బ్యూరోతో మాట్లాడి మరో 5 రప్పించామన్నారు. వచ్చే నెల నుంచి ముంబై నుంచి ఎన్‌సీబీ నిపుణులను తీసుకు వచ్చి రాష్ట్రంలోనే మొదటి సారిగా పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. సీజ్ చేసే వాహనాలు త్వరగా డిస్పోజల్ చేసే చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ అజిత వెజెండ్ల, ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌వోగా భాస్కరరావు బాధ్యతల స్వీకరణ



భాస్కరరావును అభినందిస్తున్న పూర్వ డీఎస్‌వో

మహారాణిపేట: జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్‌వో)గా డి.భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఎస్‌వోగా పనిచేసిన డి.సూర్యప్రకాశరావు శ్రీకాకుళానికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. భాస్కరరావు పౌర సరఫరాల కార్పొరేషన్ జోనల్ మేనేజర్‌గా కాకినాడలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. నిత్యావసర సరకులను సకాలంలో కార్డుదారులకు అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఫేక్ ఇన్‌స్టా ఖాతాలో యువతి ఫొటోలు పెట్టి వేధింపులు

- గుంటూరులో నిందితుడి అరెస్ట్

విశాఖ సిటీ: ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో యువతి ఫొటోలు పెట్టి వేధిస్తున్న యువకుడిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గుంటూరు నుంచి విశాఖకు తీసుకువచ్చి రిమాండ్‌కు పంపించారు. వివరాలివీ... నగరానికి చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్‌కు గుర్తు తెలియని ఇన్‌స్టా ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. దానికి ఆమె అంగీకరించింది. యువకుడితో కొద్ది రోజుల చాటింగ్ తర్వాత పరిచయం పెరిగింది. యువతి నంబర్ తీసుకున్న ఆ యువకుడు తరచూ మాట్లాడుకున్నారు. తర్వాత బయట కలిసి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ఆ యువకుడు నకిలీ ఇన్‌స్టా గ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అందరికీ పంపించాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత సహాయంతో విజయనగరానికి చెందిన చింతగుంటి చిన్నారావుగా గుర్తించారు. గుంటూరులో అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు.

రెవెన్యూశాఖలో కొనసాగుతున్న బదిలీలు

మహారాణిపేట: రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం కొనసాగుతోంది. 8 మంది డిప్యూటీ తహసీల్దార్లు(డీటీ), 11 మంది గ్రేడ్-2 వీఆర్‌వోలను శుక్రవారం బదిలీ చేశారు. పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ మందిపై ఆరోపణలు రావడంతో బదిలీలు చేపట్టారు. అయితే వీరిని ఆర్డీవో కార్యాలయంలో నియమించడంపై కూడా విమర్శలు వస్తున్నాయి.

'స్టీల్' కాంట్రాక్ట్ కార్మికుల నెత్తిన పిడుగు

- తొలగింపు చర్యలు ప్రారంభించిన యాజమాన్యం
- 4000 మంది ఆన్‌లైన్ పాసుల రద్దు
- కార్మిక సంఘాల ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం: తెలుగువారి ఆత్మగౌరవం ఉక్కు పరిశ్రమకు ఉరి తాళ్లు బిగుసుకుంటున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను దివాలా సంస్థగా చూపించి ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియ జరిగిపోతోంది. మొన్న గోదావరి.. నిన్న అన్నపూర్ణ బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడ్డాయి. ఇప్పటికే మూలధనం సమస్య వెంటాడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఒకేసారి 4,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా కార్మికుల ఆన్‌లైన్ పాసులను రద్దు చేసింది. యాజమాన్యం ఏకపక్షంగా తీసుకున్న ఈ చర్యపై కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కార్మిక సంఘాలు ఆగ్రహం చెందాయి. దీనిపై యాజమాన్యంతో అటో ఇటో తేల్చుకునేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ లేదు.. ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి ప్రభుత్వం హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయింది. ఇంతవరకు రూ.500 కోట్ల సాయం తప్ప మరేవిధమైన ప్రయోజనం దక్కలేదు. మరోవైపు ఒక్క ఫర్నేస్‌లో మాత్రమే నామమాత్రంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఉద్యోగులను ఆర్థికంగా వేధిస్తున్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. పొదుపు చర్యలంటూ క్వార్టర్లలో ఉన్న కార్మికుల కరెంట్ చార్జీలు పెంచారు. హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్‌ఏటీఏ, ఎల్‌ఎల్‌టీసీలు, కార్మికులకు బోనస్, అధికారులకు పీఆర్పీ నిలిపివేశారు. ఉద్యోగులను తగ్గించడంలో భాగంగా 500 మందిని నగర్‌నార్, సెయిల్ ప్లాంట్లకు డిప్యూటేషన్ చర్యలు ప్రారంభించారు. వీఆర్‌ఎస్ పేరిట 2,500 మంది ఉద్యోగులను పంపడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పుడు 30 శాతం తగ్గింపు పేరిట ఏకంగా 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా కార్మికుల గేటు పాసులను ఆన్‌లైన్‌లో రద్దు చేస్తున్నారు. రేపటి నుంచి మీకు పనులు లేవు, రావద్దు అంటూ సమాచారం ఇస్తున్నట్టు కార్మిక నాయకులు చెబుతున్నారు. ఈ విషయంలో కాంట్రాక్టర్లకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. కాంట్రాక్టర్ల వద్ద పనిచేసే కార్మికులను తొలగించాలనుకుంటే వారి ద్వారా సమాచారం ఇవ్వాల్సింది పోయి.. నేరుగా యాజమాన్యం తొలగించడం పట్ల అన్ని వర్గాలు విస్మయం చెందుతున్నాయి. కాగా.. యాజమాన్యం ఆకస్మికంగా తీసుకున్న ఈ నిర్ణయం పట్ల కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సమయం ఇవ్వకుండా తమను తొలగిస్తే తమ కుటుంబాలు ఏమవ్వాలంటూ కన్నీటిపర్యంతమవుతున్నారు. ఈ అంశంపై కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక సంఘాలకు కనీసం చెప్పకుండా యాజమాన్యం నిర్ణయం తీసుకోవడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు.



న్యాయ పోరాటం చేస్తాం



కాంట్రాక్ట్ కార్మికుల ఆకస్మిక తొలగింపు అప్రజాస్వామికం. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఇలా గేటు పాసులు రద్దు చేయడం దుర్మార్గం. ఏ ఒక్కరినీ తొలగించడాన్ని అంగీకరించబోము. అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం. న్యాయ పోరాటం చేయడానికి కూడా సిద్ధం. -జి.శ్రీనివాసరావు, అధ్యక్షుడు, సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్

కడుపు కొడుతున్నారు



ప్లాంట్ పరిరక్షిస్తామని చెప్పి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ద్వారా వారి కడుపు కొడుతున్నారు. పరిరక్షిస్తామంటే పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చర్యలు చేపట్టి అందుకు తగ్గట్టు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను నియమించాలి. ఇలా అర్ధాంతరంగా తొలగిస్తామంటే చూస్తూ ఊరుకోం. ఎంతవరకైనా వెళ్లి తొలగింపును అడ్డుకుంటాం. - మంత్రి రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు,ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

తొలగింపు దుర్మార్గం



సెయిల్‌లో 19 మిలియన్ టన్నుల సామర్థ్యానికి లక్ష మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. దాని బట్టి చూస్తే ఇక్కడ 7.3 మిలియన్ టన్నులకు కనీసం 30 వేల మంది ఉండాలి. అన్నింటికి సెయిల్ ప్రామాణికంగా ఉండే ఈ ప్లాంట్‌లో ఉన్న 14 వేల మంది నుంచి నాలుగు వేల మందిని ఎలా తొలగిస్తారు. ఇది దుర్మార్గపు చర్య. – కె.ఎస్.ఎన్.రావు, అధ్యక్షుడు, స్టీల్ ఏఐటీయూసీ

1,2,3 తేదీల్లో నిరాహార దీక్షలు

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల నిర్ణయం

అల్లిపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే 1, 2, 3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాలతో కలసి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు అఖిల పక్ష నేతలు తెలిపారు. అల్లిపురంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నాయకులు దీక్షల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 1న యువత, విద్యార్థులు, 2న కార్మిక సంఘాలు, 3న మహిళా సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం రాష్ట్ర పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అఖిల పక్షాన్ని తక్షణమే ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు మల్లయ్య, సీఎఫ్‌టీయూఐ జాతీయ నాయకుడు ఎస్.కనకారావు, ఏఐసీటీయూ ప్రతినిధి కె.దేవ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షుడు ఎస్కే రెహమాన్, సీఐటీయూ నాయకుడు కె.కుమార్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

కె.కె.లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: బచేలి, కిరండూల్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కె.కె.లైన్‌లో నడిచే రైళ్లు దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్, విశాఖ–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి అక్టోబర్ 4 వరకు, కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్, కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ 29 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ–కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

పర్యాటకంలో విశాఖకు అవార్డుల పంట

- 37 విభాగాల్లో 12 అవార్డులు కైవసం



బెస్ట్ యునీక్ టూరిజం ప్రాజెక్టు అవార్డు అందుకుంటున్న 'విశ్వనాథ్' సంస్థ చైర్మన్ కాశీ విశ్వనాథం



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న ఎలిగెంట్ అధినేత పవన్ కార్తీక్



బెస్ట్ ఇన్ బౌండ్ టూర్ ఆపరేటర్ అవార్డు అందుకుంటున్న ట్రావెల్ ఐక్యూ ఎండీ ఉష

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రతిష్టాత్మక టూరిజం అవార్డుల్లో ఉమ్మడి విశాఖ జిల్లా మరోసారి కీలకమైన అవార్డులు సొంతం చేసుకుంది. ఏపీ స్టేట్ యాన్యువల్ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2024 పేరుతో విజయవాడలో శుక్రవారం రాత్రి పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేశారు. మొత్తం 37 విభాగాల్లో అవార్డులు అందించగా.. ఇందులో 12 అవార్డులను నగరానికి చెందిన వివిధ హోటళ్లు, రిసార్టులు, స్పోర్ట్స్ క్లబ్‌లు, ట్రావెల్ సంస్థలు దక్కించుకున్నాయి.

విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఆయా సంస్థల ప్రతినిధులు అవార్డులను అందుకున్నారు. బెస్ట్ యునీక్ టూరిజం ప్రాజెక్టు అవార్డు రేసులో నిలిచిన తొలిసారే విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ దక్కించుకుంది. మంత్రి చేతుల మీదుగా విశ్వనాథ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బి.కాశీ విశ్వనాథ్ అవార్డును అందుకున్నారు. అదే విధంగా.. బెస్ట్ 5 స్టార్ హోటల్‌గా రాడిసన్ బ్లూ రిసార్ట్, బెస్ట్‌సివిక్ మేనేజ్‌మెంట్ ఆఫ్ టూరిజం డెస్టినేషన్ అవార్డును అరకు ట్రైబల్ మ్యూజియం సొంతం చేసుకుంది. బెస్ట్ బడ్జెట్ హోటల్‌గా ఎలిగెంట్ హోటల్, బెస్ట్ చెఫ్‌గా డాల్ఫిన్ హోటల్స్‌కు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ దారపురెడ్డి వెంకటనాయుడు అందుకున్నారు. బెస్ట్ స్టాండ్ ఎలోన్ కన్వెన్షన్ సెంటర్‌గా చెన్నాస్ హెరిటేజ్ హోటల్స్ అండ్ రిసార్ట్, బెస్ట్ బీచ్‌గా రుషికొండలోని బ్లూఫ్లాగ్ బీచ్, బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్‌గా ట్రావెల్ హోమ్, బెస్ట్ ట్రావెల్ ఏజెంట్‌గా ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ వరుసగా ఆరోసారి సొంతం చేసుకుంది. మోస్ట్ ఇన్నోవేటివ్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్(డొమెస్టిక్)గా హాలిడే వరల్డ్, బెస్ట్ టూరిజం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌గా సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్, ఏపీ టూరిజం బెస్ట్ ఫిలిమ్ అవార్డుని బుద్ధం శరణం సొంతం చేసుకున్నాయి.

2న ప్రజా ఉద్యమ ర్యాలీ

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు అక్టోబర్ 2న నిర్వహిస్తున్న ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని ఓ హోటల్‌లో విశాఖ సిటిజన్ ఫోరం శుక్రవారంఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఒక క్రమపద్ధతిలో ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం దీనిని వ్యతిరేకించకుండా.. తలాడిస్తోందని మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ చేపడుతున్న ప్రజా ఉద్యమ ర్యాలీ డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగుతుందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందన్నారు. విశాఖ సిటిజన్ ఫోరం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలకు వనరులు సమకూర్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫోరం అధ్యక్షుడు పి.ఎస్.తిలక్, కార్యదర్శి పి.రామకృష్ణ, కోశాధికారి పి.రాము పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపం కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని.. ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999కు సంప్రదించవచ్చు.

తీరాన్ని రక్షించడం పెద్ద సవాల్

గోపాలపట్నం: తీరాన్ని రక్షించడాన్ని సవాలుగా తీసుకోవాలని డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్టీఎల్ మానసి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన 51వ నేషనల్ సింపోజియం ఆన్ ఎకౌస్టిక్–2024లో ఆయన మాట్లాడారు. అండర్ వాటర్ వెపన్స్ తయారీలో ధ్వని కాలుష్యాన్ని తగ్గించే విధంగా మరింత కృషి చేయాలన్నారు. డీఆర్‌డీవో రిసోర్సెస్ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కోరుకొల్ల మాట్లాడుతూ నీటి అడుగున వాడే ఆయుధాలు, వాహనాలపై పరిశోధనలు చేయాలన్నారు. ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, ఎకౌస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అగర్వాల్, సింపోజియం ఆర్గనైజింగ్ చైర్మన్ పి.వి.ఎస్ గణేష్ కుమార్, సింపోజియం కన్వీనర్ వి.రామకృష్ణ తదితరులు మాట్లాడిన అనంతరం పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. మనోరంజన్ పత్రి, బి.వి.ఎస్.ఎస్ కృష్ణ కుమారి, కవిత ఠాకూర్, ఎస్సార్ రఫత్, రీత పైకారియ, తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పనితీరు భేష్

మహారాణిపేట: జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పనితీరు సంతృప్తికరంగా ఉందని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.లావణ్య వేణి కితాబిచ్చారు. కలెక్టర్ విచక్షణ నిధుల నుంచి రూ.5 కోట్లతో సాంఘిక సంక్షేమ హాస్టళ్లను పునరుద్ధరించినందుకు ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టినందుకు కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ నెం.1, విశాఖ సెంట్రల్ పార్కు వద్ద ఉన్న బాలికల కళాశాల, హాస్టల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. స్థలం అందుబాటులో ఉన్న చోట కిచెన్ గార్డెన్ పెంచాలని ఆమె సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, సహాయ సంక్షేమాధికారులు శ్యామల, రమాదేవి పాల్గొన్నారు.

రైల్వేస్ మెన్ బాక్సింగ్ ఓవరాల్ చాంప్ ఉత్తర రైల్వే

- టీం చాంప్ ఆగ్నేయ మధ్య రైల్వే
- ముగిసిన ఆల్‌ఇండియా అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : అఖిల భారత అంతర రైల్వేస్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను ఉత్తర రైల్వే బాక్సర్లు కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో టీమ్ చాంపియన్‌షిప్‌ను ఆగ్నేయ మధ్య రైల్వే జట్టు సాధించింది. ఈకోరైల్వే వాల్తేర్ ఆధ్వర్యంలో 48 కేజీల వెయిట్ నుంచి 92+ కేజీల వెయిట్ వరకు 13 కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా ఉత్తర రైల్వే బాక్సర్లు 8 మంది టైటిల్స్ సాధించారు. దక్షిణ, తూర్పు, వాయవ్య, మధ్య రైల్వే జోన్లకు చెందిన బాక్సర్లు ఆయా వెయిట్ కేటగిరీల్లో విజేతలుగా నిలిచారు. యూత్ కామన్‌వెల్త్, యూత్ చాంపియన్ సచిన్ సివాచ్ (ఉత్తరరైల్వే) 60 కేజీల వెయిట్ కేటగిరీలో వీరేందర్‌సింగ్ (తూర్పు రైల్వే) వాకోవర్ చేయడంతో టైటిల్‌పోరులో విజేతగా నిలిచాడు. 86కేజీల వెయిట్‌లో సైతం మనీష్‌పవార్ (ఉత్తరరైల్వే) వాకోవర్ చేయగా అభిమన్యులౌరా (పాటియాలా లోకో మోటివ్ వర్క్స్) గెలుపొందాడు. 92 కేజీల వెయిట్‌లో నితిన్‌కుమార్(ఆగ్నేయరైల్వే)తో జరగాల్సిన మ్యాచ్ రద్దు చేయడంతో నమన్‌తన్వర్ (ఉత్తరరైల్వే)ను విజేతగా ప్రకటించారు.

టైటిల్ విజేతలు వీరే...: 54 కేజీల వెయిట్ కేటగిరీలో హోరాహోరీగా సాగిన పంచ్‌ల పోరులో రాజేందర్‌సింగ్ (ఉత్తర) 4–1తో అనంత చోప్డే (మధ్య)పై విజ యం సాధించి టైటిల్ అందుకున్నాడు. ఆతిథ్య జట్టు తూర్పుతీర రైల్వేకు చెందిన బాక్సర్లు 63.5 కేజీల వెయిట్‌లో కె.శ్యాంసుందర్ 5–0తో అమిత్ కుమార్(ఉత్తర) చేతిలోనూ, 48 కేజీల వెయిట్‌లో సీహెచ్ ఉపేంద్ర సైతం 5–0 తేడాతోనే గోవింద్‌సహాని (ఉత్తర) చేతిలో పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచారు. 5–0తో ఉత్తర రైల్వే బాక్సర్లు రోహిత్ మోర్ చేతిలో మదన్(దక్షిణ), నిఖిల్ దూబె చేతిలో మణికంఠన్(దక్షిణ), సాగర్ చేతిలో నీరజ్‌కుమార్(మధ్య) పరాజయం పాలయ్యారు. అంకిత్(పటియాలా లోకోమోటివ్)పై ఆషిష్ ఇన్సా(దక్షిణ), సందీప్ హుడా(ఆగ్నేయ మధ్య)పై హేమంత్ (వాయవ్య), వినీత్(ఉత్తర మధ్య)పై ఇస్మిత్ సింగ్(మధ్య రైల్వే) విజయం సాధించి టైటిల్ సాధించారు.

'ఎంజీఎం సెవెన్ హిల్స్'గా సెవెన్ హిల్స్



లోగోను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ప్రశాంత రాజగోపాలన్, సీఈవో ఎం.కె.బోస్

మహారాణిపేట: రామ్‌నగర్‌లోని సెవెన్ హిల్స్ ఆస్పత్రి 'ఎంజీఎం హెల్త్ కేర్ సెవెన్ హిల్స్'ఆస్పత్రికి ఇక నుంచి సేవలందించనుంది. సిరిపురంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆస్పత్రి కొత్త లోగోను ఎంజీఎం హెల్త్ కేర్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత రాజగోపాలన్, ఆస్పత్రి సీఈవో ఎంకే బోస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రశాంత రాజగోపాలన్ మాట్లాడుతూ 'డూయింగ్ మోర్ బెటర్'అనే నినాదంతో సెవెన్ హిల్స్ ఆస్పత్రి వారసత్వాన్ని కొనసాగించేందుకు ఎంజీఎం హెల్త్ కేర్‌గా పేరు మార్పు చేసినట్లు వెల్లడించారు. దశాబ్దాలుగా విశాఖలో సేవలందిస్తున్న సెవెన్ హిల్స్ ఆస్పత్రి స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ఎంజీఎం నైపుణ్యంతో రోగులకు అత్యాధునిక వైద్య సేవలందిస్తామన్నారు. పునర్వ్యవస్థీకరించిన ఎంజీఎం సెవెన్ హిల్స్‌లో అధునాతన క్రిటికల్ కేర్ యూనిట్లు, ఇంటెన్స్ కేర్ యూనిట్లతోపాటు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని వెల్లడించారు. 100 మందికి పైగా వైద్యులు, 700 మంది ఆరోగ్య సంరక్షణ నిపుణులతో వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు.

ప్రతిభా ప్రహ్లాద్‌కు వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం

మద్దిలపాలెం: భారతీయ సంప్రదాయ నృత్యాల వైభవంతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్(గౌడ్) ఆధ్వర్యంలో శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజుల వైశాఖీ నృత్యోత్సవ్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదాయపన్నుల శాఖ ఇన్వెస్టిగేషన్ విభాగ సహాయ సంచాలకుడు శంకర్ పాండే, సూదగాని రవిశంకర్ నారాయణ్, వీఎండీఏ అధ్యక్షుడు ఎమ్మెస్సెన్ రాజు ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం న్యూ ఢిల్లీకి చెందిన ప్రసిద్ధ భరతనాట్య నిపుణురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రతిభా ప్రహ్లాద్ నాట్యం అలరించింది. కోల్‌కతాకు చెందిన పౌశాలీ చటర్జీ తన నందని మూమెంట్ ఆర్ట్స్ బృందంతో కలసి మణిపురి నృత్య ప్రదర్శనలతో ఓలలాడించారు. ఒడిశాకు చెందిన జై మా దుర్గా కళా పరిషత్ బృందం ఉమాకాంత్ బెహరా ఆధ్వర్యంలో సంబల్‌పురి నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం ప్రతిభా ప్రహ్లాద్ వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం–2024 అందుకున్నారు. ప్రముఖ మణిపురీ నాట్య కళాకారిణి పౌశాలీ చటర్జీ వైశాఖీ ఎక్సలెన్స్ అవార్డు, సంబల్‌పురి నాట్యాచార్యులు ఉమాకాంత్ బెహరా వైశాఖీ నాట్యశ్రీ పురస్కారాలందుకున్నారు. డాక్టర్ పేరాల బాలమురళీ కృష్ణ తనదైన శైలిలో వ్యాఖ్యానం అందించారు.

ఐటీఐ విద్యార్థి మృతి

- బక్కన్నపాలెం దివ్యాంగుల ఐటీఐలో విషాదం



దివ్యాంగ విద్యార్థి జానకీరావు (ఫైల్)

మధురవాడ: మధురవాడ సమీపంలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శిక్షణ సంస్థ(టీసీపీ)లో ఐటీఐ కార్పెంటర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థి దొడ్డి జానకీరావు(20) మృతి చెందాడు. వివరాలివీ.. కైలాసపురం శాంతినగర్–1కి చెందిన త్రినాథ్ కుమారుడు జానకీరావు ఆరోగ్యం బాగోలేక కొద్ది రోజుల కిందట ఇంటికి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం తిరిగి ఐటీఐకి వచ్చాడు. మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం వరకు విద్యార్థులతో కలిసి సంతోషంగా గడిపాడు. రాత్రి 9 గంటలకు పడుకున్న కొద్దిసేపటికి వాంతి చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం లేచి చూసినప్పుడు జానకీరావు స్పందించకపోవడంతో సహచర విద్యార్థులు వార్డెన్‌కు సమాచారమిచ్చారు. వార్డెన్, ప్రిన్సిపాల్ భాస్కర్ ఐటీఐకి చేరుకుని 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అయితే అంబులెన్స్ రావడానికి గంట సమయం పడుతుందని వారు చెప్పడంతో ప్రైవేట్ వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా.. జానకీరావు అర్ధరాత్రి సమయంలో మృతి చెంది ఉంటాడని సహచర విద్యార్థులు అంటున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

వర్షం కురుస్తూనే ఉంది.!

సాక్షి, విశాఖపట్నం : రుతుపవనాలు ప్రభావం.. ఉత్తరాంధ్రకు సమీపానికి వచ్చి బలహీనపడుతూ వెళ్లిపోయిన ఉపరితల ఆవర్తన ప్రభావం.. విశాఖ నగరంపై కనిపించింది. రెండు రోజులుగా మధ్య మధ్యలో విరామమిస్తూ వర్షం కురుస్తూనే ఉంది. గురువారం నుంచి పడుతున్న వర్షాలకు నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో వర్షం నిలిచిపోయింది. రోడ్లపై మురుగునీరు ప్రవహించింది.